

ఫౌండేషన్ పాఠశాలలెన్నో బహిరంగ పరచాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో ఫౌండేషన్ పాఠశాలలు ఎన్ని ఏర్పాటు చేయనున్నారో బహిర్గతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలల యాజమాన్య కమిటీలతో రహస్యంగా సమావేశాలు నిర్వహించి వారిని తప్పుతోవ పట్టించి అనుకూలంగా నివేదికలు తయారు చేసే ప్రయత్నంలో జిల్లా అధికారులు వున్నారని చెప్పారు. ఎంఇఒలు, క్లస్టర్ హెచ్‌ఎంలకు ఈ భాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం ఫౌండేషన్ పాఠశాలలపై రహస్య సమావేశాల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పాఠశాలల సంఖ్య బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు.

తొలిరోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

- 586 మంది విద్యార్థులు గైర్హాజరు
- కురుపాం పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/కురుపాం

జిల్లావ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జనరల్, ఒకేషనల్, ప్రైవేటు విద్యార్థులతో కలిపి 9,335 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 8,749 మంది విద్యార్థులు హాజరయ్యారు. 586 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించని నిబంధన నేపథ్యంలో విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రానికి బాలగొడబకు చెందిన గాయత్రీ అనే వివాహిత తన ఆరునెలల పసిపాపను తీసుకొని పరీక్షా కేంద్రానికి వచ్చింది. పాపను భర్తకు అందజేసి ఆమె పరీక్షా కేంద్రానికి వెళ్ళింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు గాని, కాపీలు గాని జరగకుండా పోలీసులు ఇన్విజిలేటర్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ లు పర్యవేక్షించారు.

కురుపాంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కురుపాం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇంటర్మీడి యట్ విద్యా మండలి మార్గదర్శ కాలు, సూచనలకు అనుగుణంగా ప్రశాం త వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని ఇన్విజిలేట ర్లకు కలెక్టర్ సూచించారు. సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీరు తదితర ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, పోలీస్ బందోబస్తు పకడ్బందీగా ఉండాలని సంబంధిత సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు వివరించారు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కురుపాం కేంద్రంలో జరుగుతున్న పరీక్షల తీరును చీఫ్ సూపరింటెండెంట్ ఎల్.లలిత కలెక్టర్ వివరించారు. ఈ కేంద్రంలో 538మంది విద్యార్థులకు గానూ 486మంది పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. 52మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు.

వీరఘట్టంలో పరీక్ష రాసేందుకు ట్రైసైకిల్‌పై విద్యార్థిని తీసుకొచ్చిన తండ్రి

సీతంపేట : స్థానిక బాలుర బాలికల గురుకుల కళాశాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బాలికల గురుకుల కళాశాల పరీక్ష కేంద్రంలో 28 మంది, బాలుర గురుకుల కళాశాల పరీక్షా కేంద్రంలో 9 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు సూర్య కుమారి, కృష్ణమోహన్ తెలిపారు.

సీతానగరం: స్థానిక గవర్నమెంట్ జూనియర్ కళాశాల తో పాటు జోగింపేట ప్రతిభా పాఠశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు శారు. జోగింపేట ప్రతిభ పాఠశాల పరీక్ష కేంద్రంలో 156 మందికి 154 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 273 మంది విద్యార్థులకు 253 మంది హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల నిర్వహకులు తెలిపారు.

వీరఘట్టం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డీజీ ఎస్ వి త్రినాథ్ శనివారం తెలిపారు. 315 మంది విద్యార్థులకు గానూ 307 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు గంగాడ గణేష్, శైల గ్రేస్ స్క్రైబర్ సహాయంతో పరీక్ష రాసినట్లు ఆయన తెలిపారు.

పార్వతీపురంలో పసిపాపతో పరీక్షా కేంద్రానికి వచ్చిన విద్యార్థిని

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి

సిపిఎం నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లా తీవ్రమైన అన్యాయానికి గురైందని, జిల్లా అభివృద్ధికి నిధుల కేటాయింపులో మొండి చేయి చూపించిందని సిపిఎం నాయకులు విమర్శించారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం డిఆర్‌ఒకు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలించింది ఎవరైనా జిల్లాకు అన్యాయం షరా మామూలేనన్నారు. ఏ బడ్జెట్‌లోనూ సరైన కేటాయింపులు ఉండవుని, కేటాయించినది కూడా ఖర్చు చేయరని విమర్శించారు. ఏనాటి జంఝావతి నేటికీ అదే స్థితి కొనసాగిస్తూ పాలకులు ఈ ప్రాంతంపై వివక్ష చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధే సర్వస్వమన్నట్లు, అదే ప్రభుత్వ లక్ష్యమైనట్లు వ్యవహరించొద్దని, మిగతా రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేసి అమరావతిని మరో హైదరాబాద్ చేయొద్దని అన్నారు. జిల్లా అబివృద్ధికి ఈ బడ్జెట్లో రూ.10వేల కోట్లు కేటాయించమని ప్రభుత్వాన్ని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నామని అన్నారు. జిల్లాలో యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ, పార్వతీపురం, పాలకొండ, కూరుపాంలో పీజీ కాలేజీలు మంజూరు చేయాలని, సీతంపేట, సాలూరు, కురుపాంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించాలని, ఇందుకు ఈ బడ్జెట్లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని, అలాగే జంఝావతి, అడారుగెడ్డ, తోటపల్లి, పెద్దగెడ్డ ప్రాజెక్టులకు, గిరిజన ప్రాంతంలో మినీరిజర్వాయర్ల నిర్మాణానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని కోరామన్నారు. లచ్చయ్యపేట ఎన్సీస్ షుగర్, జీగిరాం జ్యూట్ మిల్లు ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వమే నడపాలని, గిరిజన ప్రాంతంలో జీడి, చింతపండు, పైన్ ఆపిల్, ఆయుర్వేద మందుల పరిశ్రమ నెలకొల్పాలని, వీటికి ఈ బడ్జెట్లో నిర్ణయాలు చేసి నిధులు కేటాయించాలని కోరామన్నారు. రామభద్రాపురం నుంచి కూనేరు వరకు రోడ్డు వెడల్పు చేసి కోటిపాం వద్ద జంఝావతిపై బ్రిడ్జి నిర్మించాలని, పూర్ణపాడు- లాబేడు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని, ఇందుకు ఈ బడ్జెట్లో వేయి కోట్లు కేటాయించాలని కోరారు. పార్వతీపురం జిల్లా కేంద్రమైప్పటికీ తాగునీరు లేదని, పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణం చేస్తామన్న హామీని నేటికి అమలు చేయలేదన్నారు. శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో జిల్లా అభివృద్ధి కోసం జిల్లా నుండి ఎన్నికైన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో పోరాడాలని, సిపిఎం ప్రజలను కదిలించి ఉద్యమాలు చేసి వారికి మద్దతుగా నిలుస్తుందని అన్నారు. జిల్లా అభివద్ధి కోసం జరిగే ఉద్యమాల్లో జిల్లా ప్రజలు తమతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.కృష్ణమూర్తి, గొర్లి వెంకటరమణ, రెడ్డి శ్రీదేవి, బంటు దాసు, కొల్లి సాంబమూర్తి, రెడ్డి వేణు తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను తిరువీధి రోడ్ మ్యాప్ పరిశీలన

ప్రజాశక్తి - సాలూరు

శ్యామలాంబ పండుగ నేపథ్యంలో పట్టణంలో సిరిమాను రథం తిరిగే ప్రదేశాలకు సంబంధించిన రోడ్ మ్యాప్‌ను విద్యుత్ ఇఇ గోపాలరావు నాయుడు, ఎడిఇ రంగారావు ,ఎఇ నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. సిరిమాను తిరిగే ప్రదేశాలలో విద్యుత్ వైర్లు ఎక్కడెక్కడ వేలాడి వున్నాయి, ఎన్ని స్థంబాలు, ట్రాన్స్ ఫార్మర్లు అవసరం వంటి అంశాలపై అంచనా కోసం అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ అక్కేన అప్పారావు, సభ్యులు విద్యుత్ అధికారులతో చర్చించారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఎరువుల దుకాణాలను సహాయ వ్యవసాయ సంచాలకులు బి.మధుసూధనరావు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణంలో రైతులకు కచ్చితంగా రసీదులు ఇవ్వాలని, రసీదు పుస్తకాలు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని, అలాగే ఎరువుల ధరలు, లభ్యత పట్టిక ప్రదర్శించాలని సూచించారు. ఎరువులు అమ్మిన రైతుల వివరాలు ఎప్పటికీ అప్పుడు నమోదు చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఎరువుల స్టాక్ దస్త్రాలను పరిశీలించి, స్టాక్ రికార్డు అనేది కచ్చితంగా నమోదు చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా ఎరువుల గౌడౌన్ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో స్టాక్ పుస్తకంలో ఉన్న బస్తాలు సమానంగా ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. ఎఒ ఎస్.అవినాష్ మాట్లాడుతూ ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో స్తంభించిన పాలన

ధ్రువీకరణ పత్రాలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో పరిపాలన అస్తవ్యస్తంగా ఉంది. ఇటీవల కమిషనర్ సర్వేశ్వరరావు ఎసిబికి చిక్కి అరెస్ట్ అయ్యారు. దీంతో కొత్తగా కమిషన్‌ను నియమించకపోవడంతో పరిపాలన అస్తవ్యస్తంగానే ఉంది. సర్వేశ్వరరావు అరెస్టు అయ్యి వారం రోజులు కావస్తున్నా ఇంతవరకూ కనీసం ఇన్ఛార్జి కమిషనర్‌ను కూడా నియమించకపోవడంతో పరిపాలన స్తంభించింది. మేనేజర్ స్థాయిలో గల జయరాం తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టినప్పటికీ ధ్రువీకరణ పత్రాల జారీలో ఇన్‌ఛార్జి కమిషనర్ హోదా లేకపోవడంతో చర్యలు తీసుకోలేకపోతున్నారు. దీంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనన, మరణ సాల్వెన్స్, ఆస్తిపన్ను సర్టిఫికెట్లు జారీ విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డిజిటల్ సంతకంతో కమిషనర్ ఇవ్వాల్సినప్పటికీ ఇన్ఛార్జి కమిషనర్ హెూదా ఎవరికీ ఇవ్వకపోవడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని పలు సచివాలయాల్లో దరఖాస్తుల కుప్పలు తెప్పలుగానే ఉన్నాయి. కమిషనర్ హోదా ఎవరికీ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

మనుమకొండను ఆదర్శంగా తీర్చిదిద్దాలి :కలెక్టర్

ప్రజాశక్తి - భామిని

మండలంలోని మనుమకొండను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలను అందిపుచ్చుకొని అన్నింటా గ్రామం ముందంజలో ఉండాలని పిలుపు నిచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి కలెక్టర్ మనుమకొండ, బత్తిలి గ్రామాలను శనివారం సందర్శించారు. మనుమకొండలో ఏర్పాటు చేసిన వన్‌ధన్ వికాస కేంద్రాన్ని సందర్శించి, కేంద్రంలో తయారు చేస్తున్న పసుపు పొడి ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. అదే గ్రామంలో సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తుల ఇళ్లను సందర్శించిన కలెక్టర్, బాధితులకు పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని, ఎక్కడా చెత్తలేకుండా చూడాలని గ్రామస్తులకు కలెక్టర్ తెలిపారు. అనంతరం బత్తిలి గ్రామాన్ని సందర్శించిన ఆయన అక్కడ రైతులతో మాట్లాడారు. వ్యవసాయంలో పార్వతీపురాన్ని ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు అజోలా యూనిట్లను పెంచుతున్నామని అన్నారు. రైతులు పత్తి పంటను తగ్గించి మొక్కజొన్న, వరి పంటలపై దృష్టి సారించాలని సూచించారు. తొలుత గిరిజన ఆదివాసీ సంప్రదాయ నత్యకారులతో కలెక్టర్, పిఒ పాల్గొని నృత్యం చేశారు.

సీతంపేట : గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. ఐటిడిఎలోని ముక్కిడి పోలమ్మ జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. జీడి తయారు చేసే విధానాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కొండచీపుర్లు అగరుబత్తి, పసుపు ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించి, వీటి ఉత్పత్తిని మరింత పెంచాలని అన్నారు. వీడీవీకే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించుటకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. జీడి ప్రాసెసింగ్ యూనిట్ కు అవసరమైన యంత్ర సామాగ్రిని సమకూరుస్తామని అన్నారు. అనంతరం గడిగుడ్డిలోని పట్టు పరిశ్రమ యూనిట్ ను పరిశీలించారు. పట్టు నుంచి దారం తీసే విధానాలను సెరికల్చర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొగదర గ్రామంలో చేపడుతున్న మల్బరీ తోటను పరిశీలించి అక్కడ రైతులతో మాట్లాడారు. అనంతరం జగతపల్లి వ్యూ పాయింట్ ను పరిశీలించి టూరిజం అభివద్ధికి గల అవకాశాలను పరిశీలించారు. టూరిజం అభివద్ధికి అవసరమయ్యే చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం పనుకువలస నర్సరీలో గ్రామదర్శిని కార్యక్రమం ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి చిన్నబాబు, డిడి అన్నదొర, ఇఇ రమాదేవి, పిహెచ్ఒ గణేష్, ఎంపిడిఒ గీతాంజలి, సిడిపిఒ రంగలక్ష్మి, వెలుగు ఎపిడి సన్యాసిరావు, డిపిఎం రమణ, సెరీకల్చర్ ఏడి సల్మాన్ రాజ్, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇతరశాఖల మండల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనుమకొండలో మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

నిరసన తెలుపుతున్న గుడివాడ కాలనీవాసులు

‘ మా బడిని తొలగించొద్దు’

ప్రజాశక్తి - బలిజిపేట

మోడల్ స్కూల్ పేరుతో మాబడిని తొలగించొద్దంటూ మండలంలోని పలగర గ్రామంలోని గుడివాడ కాలనీ వాసులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ వెలుగు శ్యాంబాబు, దేవి మాట్లాడుతూ గుడివాడ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలను మోడల్ స్కూల్ పేరుతో తొలగించొద్దన్నారు. తామంతా మడ్డువలస రిజర్వాయర్ ముంపు గ్రామాల నుంచి వచ్చిన నిర్వాసితులమని, గత 20ఏళ్లుగా గుడివాడ కాలనీ, కొట్టిశ కాలనీగా ఏర్పాటై సుమారు 500 కుటుంబాలు నివసిస్తున్నామన్నారు. అప్పటి ప్రభుత్వం నిర్వాసితుల పిల్లల చదువుకు స్కూల్ కట్టించిందన్నారు. అప్పటి నుంచి తమ పిల్లలు ఇక్కడే చదువుతున్నారన్నారు. నిర్వాసితులకు అందుబాటులో పాఠశాల ఉండడం వల్ల ఎంతో ఉపయోగమని, పైగా మోడల్ స్కూల్ పేరుతో పలగర ప్రాథమిక పాఠశాలకు మార్చడం వల్ల దారిలో రెండు చెరువులు, పెద్ద అంకలం కాలువ ఉండడంవల్ల ప్రమాదం జరిగే అవకాశం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ నిర్వాసితుల కాలనీలోనే పాఠశాలను ఉంచి మా పిల్లలకు చదువు చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రీన్స్ రహదారిపై బైఠాయించిన రైతులు

పొలాలకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

గ్రీన్ ఫీల్డ్ హైవే వద్ద రైతులు నిరసన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గురువునాయుడ ుపేట, జీలికివలస, నంద రెవెన్యూ పరిధిలో ఉన్న తమ పొలాలకు రాకపోకలు సాగించేందుకు రోడ్డు సౌకర్యం కల్పించాలంటూ గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారిపై శనివారం రహదారి పనులను అడ్డుకొని, వాహనాలను నిలిపి రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈదిబిల్లి గోపి, కురిడి వసంతరావు, ఎంపిటిసి సభ్యులు ధనంజయ, సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేకు భూములిచ్చిన రైతులు తమ భూముల వద్దకు వెళ్లడానికి వీల్లేకుండా హైవే అధికారులు సైడ్ వాల్ నిర్మాణం చేపట్టి త్రోవ లేకుండా చేస్తున్నారని తెలిపారు. దీనివల్ల రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి రైతులు తమ పొలాల్లోకి వెళ్లడానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని,లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనికి స్థానిక తహశీల్దార్ డి.రవి మాట్లాడుతూ జిల్లా అధికారులు, హైవే అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఫోన్లో మాట్లాడారు. అలాగే హైవే సిబ్బంది ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆరు రోజుల్లో రహదారి సమస్య పరిష్కరించకపోతే మళ్లీ ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరించారు.

ప్రాజెక్టుల కన్నా.. ఎయిర్‌పోర్టే మిన్నా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను..! రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ఉమ్మడి విజయనగరం జిల్లా అభివృద్ధి, ప్రజల అవసరాలు, సంక్షేమం, చదువు సంధ్యలు, వైద్యారోగ్యం వంటివాటి కన్నా అత్యంత ధనవంతులకు అవసరమైన భోగాపురం ఎయిర్‌పోర్టునే ప్రభుత్వం మిన్నగా భావిస్తోంది. ఈ విషయం తాజా రాష్ట్ర బడ్జెట్‌లో చాలా స్పష్టంగానే అర్థమైంది. పైకి మాత్రం పేదలు, మధ్య తరగతి ప్రజల కోసం తమ ప్రభుత్వం పనిచేస్తున్నట్టుగాను, విజయనగరం జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టుగాను పాలకులు ప్రతి సందర్భంలోనూ చెబుతున్నారు. కానీ, ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులతో మాటలకు చేతలకు పొంతన లేదని, పేదల కన్నా కార్పొరేట్ అవసరాలే ప్రభుత్వానికి ఎక్కువగా మారాయని తేటతెల్లమైంది. బడ్జెట్‌లో ఉమ్మడి విజయనగరానికి కేటాయింపులను ఒక్కసారి పరిశీలిస్తే భోగాపురం ఎయిర్‌పోర్టుకు అనుసంధానంగా రహదారి నిర్మాణం కోసం రూ.195కోట్లు కేటాయించగా, జిల్లాలోని వివిధ అవసరాలకు కేటాయించిన మొత్తం రూ.150కోట్లకు మించలేదు. జిల్లాకు ఎంతగానో అవసరమైన సాగునీటి ప్రాజెక్టులకు కంటితుడుపు కేటాయింపులే ఉన్నాయి. మూడు జిల్లాలకు సాగునీరందించే తోటపల్లి ప్రాజెక్టుకు రూ.519.1119కోట్ల కోసం అధికార యంత్రాంగం ప్రతిపాదనలు పంపగా కేటాయింపు కేవలం రూ.47.81కోట్లే. రామతీర్థసాగర్‌కు రూ.807.55కోట్లు కోరగా రూ.68కోట్లు కేటాయించారు. ఈ నిధులు కేవలం భూమి కొనుగోలు లేదా ఆర్‌అండ్‌ఆర్‌కు కూడా సరిపోని పరిస్థితి ఉంది. ఇక మన్యం జిల్లా ఏజెన్సీలో నిత్యం ఏనుగులు సంచరిస్తున్నాయి. రైతులు, అటవీ సిబ్బంది దాడికి గురైతున్నారు. కొంతమంది గాయపడగా, మరికొందరు చనిపోయారు. నిత్యం పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికీ గిరిజన ప్రాంతవాసులు, రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్ని రక్షించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఎలిఫేంట్ ప్రాజెక్టు పేరిట కేవలం రూ.కోటి 28లక్షలు కేటాయింపుతో చేతులు దులుపుకుంది. విజయనగరం జెఎన్‌టియు ఇంజినీరింగ్ వర్సిటీ అభివృద్ధికి రూ.5.60కోట్లు మాత్రమే కేటాయించారు. వర్శిటీ స్థాయి చదువులు, వసతులకు ఈ నిధుల ఏమూలకూ సరిపోని పరిస్థితి. కురుపాం ఇంజినీరింగ్ కాలేజీకి ఇంకా పూర్తిస్థాయిలో వసతులు, మౌలిక సదుపాయాలు, కాలేజీ స్థాయికి తగ్గ విద్యాప్రమాణాలు సమకూరలేదు. ఇటువంటి విద్యాసంస్థకు కూడా రూ.3.40కోట్లతో సరిపెట్టారు. కోరుకొండ సైనిక్ స్కూల్‌కి కూడా రూ.కోటి మాత్రమే కేటాయింపు. మరీ ఘోరంగా 24వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన జంఝావతి ప్రాజెక్టుకు పట్టుమని రూ.10వేలకు మించి కేటాయించలేదంటే రైతులపట్ల ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈనేపథ్యంలో కేవలం కొంతమందికి మాత్రమే ఉపయోగపడే ఎయిర్‌పోర్టుపై ఉన్న శ్రద్ధ, జిల్లా అభివృద్ధి, అందులోనూ రైతులపైనా, పేద, మధ్య తరగతి ప్రజలపైనా లేదంటూ జిల్లాలో పబ్లిక్ వినిపిస్తోంది.

ఏనుగులు ధ్వంసం చేసిన కర్బూజ పంటను పరిశీలిస్తున్న బాధిత రైతు, గ్రామస్తులు

ఏనుగుల దాడిలో కర్బూజ పంట ధ్వంసం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపాన గల పూతికవలస గ్రామానికి చెందిన మార్పు శేషుకు చెందిన రెండెకరాల కర్బుజ పంటను శనివారం ఉదయం ఏనుగుల గుంపు నాశనం చేశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి ముదుపుల కోసం అప్పులు చేసి పండించిన కర్బూజా పంట చేతికి అంది వచ్చిన సమయంలో ఇలా ఏనుగుల గుంపు పంటను నాశనం చేయడం కోలుకోలేని దెబ్బ అని రైతు ఆవేదన చెందాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ అధికారులు స్పందించి వెంటనే పంట నష్టం అంచనా వేసి పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. అంతే కాకుండా ఏనుగులను జననివాసాల నుంచి దూర ప్రాంతాలకు తరలించి రైతులు పంటలను ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నామన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలో శనివారం పూడికలు తొలగిస్తున్న పనులను ఎంపిడిఒ బి.వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వ్యాపారులకు సూచించారు. ఈయనతో పాటు ఇఒ ఎం.రవి ఉన్నారు.

ఆసుపత్రిని పరిశీలించిన డిసిహెచ్ఎస్

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆరోగ్య సేవల కోఆర్డినేటర్ డాక్టర్ రాజ్యలక్ష్మి శనివారం పరిశీలించారు. ఆసుపత్రిలోని వార్డుల్లో తిరిగి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె వెంట సూపరింటెండెంట్ డాక్టర్ వికార్ మీనాక్షి, వైద్యులు ఉన్నారు.

ఆసుపత్రి పనులను పరిశీలిస్తున్న డిసిహెచ్ఎస్ రాజ్యలక్ష్మి

క్రాష్ ప్రోగ్రాంను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

ప్రారంభమైన క్రాష్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - సీతానగం

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు క్రాస్ ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాష్ ప్రోగ్రాంను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 36 పంచాయతీల్లో మరమ్మతులకు గురైన బోర్లను గుర్తించి తక్షణమే మరమ్మతులు చేసి అందుబాటులోకి గ్రామస్తులకు తెస్తామన్నారు. గ్రామాల్లో మరమ్మతులైన బోర్లను ఇప్పటికే గుర్తించామన్నారు. మండలంలో వచ్చే మే వరకు ఈ క్రాష్ ప్రోగ్రాం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివద్ధి కార్యాలయం ఎఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్ణపాడు -లాబేసు వంతెన పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పూర్ణపడు లాబేసు వంతెన పనులు వెంటనే ప్రారంభించాలని, అలాగే ఆంధ్రా-ఒడిశా అంతర్ రాష్ట్ర రహదారి మార్గంలో కూనేరు రోడ్డు పనులను తక్షణమే నిర్వహించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పంచాయతీరాజ్ ఇఇ చంద్రశేఖర్, డిఇ రామచంద్రకు వినతి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొమరాడ మండలానికి సంబంధించి 40 గిరిజన గ్రామాలకు ఎంతో ప్రాధాన్యతిచ్చిన పూర్ణపాడు -లాబేసు గ్రామాల మధ్య నాగావళి నదిపైన వంతెన ప్రారంభించి నేటికీ 18 ఏళ్లయినా అసంపూర్తిగా వదిలేశారని అన్నారు. ఈ వంతెన పనులు పూర్తి చేస్తామని ఆగస్టు 9న జరిగిన ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పినా, నేటికీ పనులు ప్రారంభించలేదన్నారు. తక్షణమే వంతెన పనులు పూర్తిచేయాలని కోరారు. అలాగే రోడ్డు పనులు కూడా పూర్తి చేయాలని కోరారు. దీనికి ఆర్అండ్‌బి ఇఇ స్పందిస్తూ ఈనెల 8 వరకు ఎన్నికలు కోడ్ ఉన్న నేపథ్యంలో పనులు చేయలేదని, నిధులు కూడా సిద్ధంగా ఉన్నందున ఎన్నికల కోడ్ తొలగిపోయిన వెంటనే రోడ్డుపైన గోతులను పూర్తిచేసేలా పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు గురించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

4 నుంచి బొద్దిడిలో యాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 4 నుంచి 8 వరకు మండలంలోని డుమ్మంగి పంచాయతీ బొద్దెడిలో పంచ వర్ణేశ్వర స్వామివారి 11వ వార్షికోత్సవం సందర్భంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు సర్పంచి పాలక క్రాంతి కుమార్ తెలిపారు. యాత్ర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మండల స్థాయి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ దినోత్సవ సంబరాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు జి.సూర్యదేవుడు, ఎం.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ సైన్స్ క్విజ్ పోటీలు పాల్గొనడంతో వారి జ్ఞానాన్ని పెంపొందించుకోడానికి ఇవి ఉపయోగపడతాయన్నారు. చిత్రలేఖన పోటీల్లో బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, వక్తృత్వ పోటీల్లో జోగింపేట కెజిబివి పాఠశాల విద్యార్థులు కె.జాహ్నవి, సిహెచ్ హర్షితవల్లి బహుమతులను కైవసం చేసుకున్నారు. వివిధ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ వేడుకలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.ప్రసన్నలక్ష్మి, వాలేటి తవిటినాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్విన్ పేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట గ్రామపంచాయతీ పరిధిలో గల మురుగునీటి వీధి కాలువలను సర్పంచ్ చైతన్య స్రవంతి ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. వీధి కాలువలు, వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసర పరిశుభ్రత కూడా చక్కగా ఉంచుకోవాలని అన్నారు. కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాలు వస్తాయని సూచించారు. ఈ కార్యక్రమానికి ఇఒపిఆర్‌డి ధర్మారావు, పంచాయితీ కార్యదర్శులు నాగరాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై డ్రోన్‌తో నిఘా

ప్రజాశక్తి - బలిజిపేట

డ్రోన్ కెమెరాను ఏర్పాటు చేసి మండలంలో క్షేత్రస్థాయిలో దొంగతనాలకు చెక్ పెట్టేలా కృషి చేస్తున్నామని ఎస్ఐ ఎస్.సింహాచలం తెలిపారు. మండలంలోని వివిధ రకాల దొంగతనాలను నివారించడానికి క్షేత్రస్థాయిలో దర్యాప్తునకు నివారణ మార్గంగా డ్రోన్ కెమెరాను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని డ్రోన్ కెమెరా ద్వారా కొన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ గొలుసు దొంగతనాల నివారణ, సారా, పేకాట, అల్లరితో కూడుకున్న ఆకతాయిలకు, ఇతర అంతర్గత దొంగతనాలకు చెక్‌పెట్టేలా ఈ డ్రోన్ కెమెరా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇతర దొంగతనాల విషయంలో తమకు సమాచారం ఇచ్చిన వారికి ప్రభుత్వం నుండే పారితోషక ఉంటుందని తెలిపారు. అత్యవసర సమయాల్లో వెంటనే స్పందించేందుకు టోల్ ఫ్రీ నెంబర్లు 100 ,112కు సంప్రదించాలని కోరారు

డ్రోన్ ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సింహాచలం

నాణ్యమైన వైద్యం అందించాలి : పిఒ

ప్రజాశక్తి - కురుపాం

ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఐటిడిఎ పిఒ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. శనివారం ఆయన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సిహెచ్‌సి)ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు వార్డులు, లేబర్ రూమ్, మందుల నిల్వ గది తదితర వాటిని సందర్శించారు. ఐసిటిసి తనిఖీ చేసి రికార్డుల్లో నమోదు వివరాలను పరిశీలించారు. వైద్య పరికరాల పనితీరు తెలుసుకొని ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ వైద్య పరీక్షలు, వాటి నివేదికలను తెలియ జేయటకు పట్టే సమయం, వ్యాధి నిర్ధారణ పరీక్షల కిట్లు లభ్యత తదితర వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. వార్డుల్లో రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రక్త నిల్వల విభాగాన్ని పరిశీలించి వాటి సేకరణ, వినియోగాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శోభారాణిని అడిగి తెలుసుకున్నారు. స్టైమి ప్రోగ్రాం పరిధిలో హార్ట్ స్ట్రోక్ గురైన వారికి అత్యవసర సమయంలో ఇచ్చే ఇంజక్షన్స్ లభ్యత పరిశీలించి, ఇప్పటి వరకు సిహెచ్‌సిలో వినియోగించిన, వాటి ఫలిత ప్రభావంపై తెలుసుకొని రికార్డుల్లో పరిశీలించారు. ఎస్ఎన్ సియు విభాగాన్ని తనిఖీ చేసి ప్రతి నెలా ఎంతమంది నవజాత శిశువులను వివిధ ఆరోగ్య సమస్యలతో చేర్పిస్తున్నారని, చికిత్సా వివరాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పూర్తి నిర్మాణ దశలో ఉన్న కొత్త సిహెచ్సీని సందర్శించి పనుల పురోగతిపై తెలుసుకున్నారు. తదుపరి మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సీ) ను సందర్శించి

రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

సిబ్బంది పనితీరుపై పరిశీలించి రోగులకు అందిస్తున్న ఆరోగ్య సేవల వివరాలపై ఆరా తీశారు. లేబర్ రూమ్ పరిశీలించి, పిహెచ్సీ ప్రసవాలు మెరుగుపరచాలని ఆదేశించారు. చుట్టుపక్కల మారుమూల గ్రామీణులకు పిహెచ్సీల్లో మెరుగైన వైద్యం అందేలా చూడాలని అన్నారు. మందులు, వ్యాక్సిన్ నిల్వలు, రక్త పరీక్షల విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది అన్ని వేళలా అందుబాటులో ఉండాలన్నారు. పర్యటనలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, ఆసుపత్రి వైద్యులు, పిహెచ్‌సి వైద్యాధికారి డా.తనూజారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఆరోగ్య సర్వే

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆరోగ్య సర్వేలు పక్కగా చేపట్టి, ప్రజలకు మెరుగైన వైద్యమందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. మండలంలోని పెద్ద బొండపల్లి పిహెచ్‌సితో పాటు, ఎమ్మార్ నగరం, చిన్న బొండపల్లి సబ్ సెంటర్లను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలపై ఆరా తీసి ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల రికార్డులు తనిఖీ చేశారు. పరీక్షల నివేదికలు సకాలంలో తెలియజేయాలని ఆదేశించారు. మందుల నిల్వలు పరిశీలించి స్టాకు, వినియోగం రికార్డులు పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రసవాలపై ఆరా తీశారు. అక్కడి రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు, అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య సర్వేలు ఎన్సిడి, ఆర్బిఎస్కే, అంగన్వాడీ స్క్రీనింగ్‌లు ఏ మేరకు పూర్తి చేశారు, సంబంధిత వివరాలపై సమీక్షించారు. కేన్సర్ స్క్రీనింగ్‌లో అనుమానిత లక్షణాలతో ఎవరైనా గుర్తించారా అడిగి తెలుసుకున్నారు. క్షయ, కుష్టు లక్షణాలతో గుర్తించిన వారికి నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం ఊసకొండలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. అక్కడ స్థానికులతో మాట్లాడి బిపి,సుగర్ తో ఎంతమంది ఉన్నారు తెలుసుకొని ఆ వివరాలు సర్వేలో ఏ మేరకు వైద్య సిబ్బంది నమోదు చేసారో గమనించారు. ఆరోగ్య కేంద్రాల్లో, క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్బిఎస్కే ప్రోగ్రాం అధికారి, వైద్యాధికారులు అనూష, ధరణి, జిల్లా గణాంక అధికారి శంకరరావు ఎంపీహెచ్వో తీర్ల వెంకట నాయుడు సిహెచ్ఓ నందిని ఏఎన్ఎంలు డిపోలమ్మ ఆశా వర్కర్లు సిహెచ్డబ్ల్యువోలు పాల్గొన్నారు.

త్వరితగతిన ఉపాధి పనులు : డ్వామా పీడీ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ఉపాధిహామీ చట్టం కింద మండలాల్లో చేపట్టిన పనులన్నీ వీలైనంత త్వరగా ఈనెలలో పూర్తి చేయాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక మండలం పరిషత్ సమావేశ భవనంలో పార్వతీపురం, కురుపాం, సాలూరు ఉపాధి హామీ ఎపిఒలు, జెఇ, జెఎఇ, టిఎలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ గోకులాలు, ప్రహరీగోడలు, ఫారంపండ్స్, ఫిష్ పాండ్స్, రహదారులు తదితర పనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ప్రహరీ గోడల నిర్మాణాలన్నీ గ్రౌండింగ్ కావాలని, ఈ పనుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. చేపట్టిన పనులకు ఎప్పటికపుడు బిల్లులను అప్ లోడ్ చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులపై ఎంపిడిఒలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధిహామీలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఉపాధిహామీ కింద చేపడుతున్న పనులను వీలైనంత త్వరగా పూర్తిచేసి, బిల్లులను పంపాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో ప్రహరీ గోడలు నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచి కనబర్చాలన్నారు. కొత్త పనులు మంజూరు చేయించుకునేలా అధికారులు కృషి చేయాలని వివరించారు. ముఖ్యంగా జియమ్మవలస మండలంలో పనులు గ్రౌండింగ్ కావాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజన ప్రాంతాల్లో ఆర్థిక లావాదేవీలు జరిగిన చిన్న, మధ్య తరహా పరిశ్రమలను కూడా సర్వేలో తీసుకోవాలని స్పష్టం చేశారు. సర్వేలో ప్రగతి కనిపించాలని అన్నారు.

6న చలో విజయవాడకు హాజరు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఈనెల 6న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి హాజరవుతామని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శివాని, సిఐటియు జిల్లా నాయకులు గొర్లె వెంకటరమణ, వి.ఇందిర శనివారం నాడు స్థానిక జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉన్న సూపరింటెండెంట్ పట్నాన కామేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మాట్లాడుతూ ఈనెల 6న ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చలో విజయవాడ కార్యక్రమంలో మన జిల్లాలో గల అశా కార్యకర్తలంతా పాల్గొంటున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం గతంలో ధర్నా చేసినప్పుడు అధికారులు కొన్ని హామీలు ఇచ్చారని, ఆ హామీలను జీవో రూపంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సెలవులు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, లివేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వలే 62 ఏళ్లకే రిటైర్మెంట్ చేయాలని, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రికార్డులు ప్రభుత్వం ఇవ్వాలి, స్థానికంగా వచ్చే సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, ఎం.గౌరి, టి.పద్మావతి, జి.భాగ్యలక్ష్మి, ఎం.పద్మావతి, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆశాలు వినతి

డిఎంహెచ్ఒ కార్యాలయ అధికారికి వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

అక్రమాలపై సభ్యులు నిలదీయాలి : సిపిఎం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలు జరుగుతున్న అవినీతి, అక్రమాలపై కౌన్సిలర్లు పాలకవర్గ సమావేశాల్లో నిలదీయాలని సిపిఎం నాయకులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. నగర పంచాయతీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకవర్గంలో ఉన్న ప్రతిపక్ష, అధికార పక్ష పార్టీల కౌన్సిలర్లు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి అభివృద్ధివైపు ఆలోచించాలని కోరారు. నగర పంచాయతీపై అవినీతి ఆరోపణలు నిరంతరం వస్తున్నాయని, వీటిపై సమగ్ర దర్యాప్తు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కారానికి పాలకవర్గాలు ఆలోచించాలని కోరారు. అలాగే నగర పంచాయతీలో డంపింగ్ యార్డ్, తాగునీటి సమస్య పరిష్కారం కాలేదన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. పౌర సేవలు అందాలంటే ముడుపులు ఇస్తే గాని అందరం లేదని విమర్శించారు. ఇటీవల కాలంలో మురుగుకాలువల పూడికలు తీయడానికి సుమారు రూ.30లక్షలు ఖర్చయినట్లు లెక్కలు చూపిస్తు న్నప్పటికీ పాలకొండలో ఏ వార్డులో ఏ వీధిలో ఎంత ఖర్చు చేశారో పాలకవర్గ సభ్యులకు తెలియదా అని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో సిపిఎం బృందం 6 ,7 వార్డుల అనుసంధానంగా ఉన్న కాలువను పరిశీలించగా కమిషనర్ పూడికలు తొలగిస్తామని హామీ ఇచ్చినప్పటికీ పరిష్కరించలేదన్నారు. 20 వార్డుల్లోనూ ఇదే పరిస్థితి ఉందన్నారు. మెయిన్ రోడ్‌లో సుమారు రూ.8 లక్షలు ఖర్చయినట్టు చూపిస్తున్నప్పటికీ మెయిన్ రోడ్డు షాపు యజమానులే ఖర్చు చేసుకున్నామని చెబుతున్నారన్నారు. ప్రజల నుంచి ఇంటి పన్నులు ఎక్కడా లేని విధంగా పాలకొండలో వసూలు చేసే పరిస్థితి ఉందన్నారు. నగర పంచాయతీపై వస్తున్న ఆరోపణలపై శ్వేత పత్రం విడుదల చేసి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కురుపాం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా సిడిపిఒ కె.విజయగౌరి ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుండి రావాడ జంక్షన్ వరకు కెజిబివి పాఠశాల విద్యార్థినులతో బేటీ బచావో... బేటీ పడావో అంటూ నినాదాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రావాడ జంక్షన్‌లో మాట్లాడుతూ లింగ వివక్ష, బాలికల విద్య, ఆరోగ్యం ప్రాముఖ్యతను విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, తహశీల్దార్ ఎం.రవణమ్మ, కెజిబివి ఎస్ఒ ఐ.కిరణకుమారి, సూపర్వైజర్లు భవాని, జానకి, విజయగౌరి, డిసిపియు నుండి ఎన్.ప్రసాదరావు, పోషన్ అభియాన్ భాగ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సిడిపిఒ బి.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం నుంచి కెజిబివి పాఠశాల వరకు కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, ఆఫీస్ సిబ్బందితో కలిసి మహిళల ప్రాముఖ్యత గురించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ర్యాలీ నిర్వహించారు. 'మహిళలు బాలికలు హక్కులు, సమానత్వం, సాధికారత సాధించడం' అన్న లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అలాగే కెజిబివి పాఠశాలలో బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఒ షేక్ నజియా, సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలకు కుర్చీ, గుంటాట తదితరమైన క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎన్ రాజేశ్వరి, జె.జ్ఞానమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం : సిఐ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థులు తమ ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ, మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.మురళీధర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు సందర్భంగా శనివారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ భవనంలో సిఐ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, మెడికల్ వైద్యాధికారితో సమక్షంలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంపులో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో వివిధ రకాల రికార్డులు వివరాలు, కొత్త చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, వృద్ధ మిత్ర కోఆర్డినేటర్ కృష్ణమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, బాల బాలికలకు సైబరు చట్టాలు, మహిళా రక్షణ చట్టాలు, పోక్సో చట్టాల గురించి విద్యార్థులకు రూరల్ ఎస్సై సంతోషి కుమారి అవగాహన కల్పించారు. నిత్యం శాంతిభద్రతల నిర్వహణకు పోలీసులు ఉపయోగించే ఆయుధాల గురించి వివరించారు. పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్, మెడికల్ క్యాంప్ పోలీస్ స్టేషన్లో వివిధ రకాల రికార్డులు వివరాలు, కొత్త చట్టాల గురించి వివరించారు.

గరుగుబిల్లి : మహిళలకు, విద్యార్థినిలకు చట్టాలపైనా, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ఉండాలని ఎస్ఐ రమేష్‌నాయుడు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో విద్యార్థినిలకు, మహిళలకు మెడికల్ క్యాంపు, ఓపెన్ హౌస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్ సహకారంతో మెడికల్ క్యాంపు నిర్వహించి, ఓపెన్ హౌస్ ను సందర్శించిన మహిళలు, విద్యార్థినిలు కు పోలీస్ స్టేషన్‌లో జరుగు విధుల పట్ల అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, ఫోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్ బాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్‌లపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం ఉమెన్ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100 లేక 112, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930, ఈగల్ హెల్ప్ లైన్ 1972 అన్నారు. మహిళలంతా ఈ సేవలను వినియోగించుకుని, ఎలాంటి అన్యాయం జరిగినా తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ మురళీధర్

కురుపాం : స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంపై ఎస్సై పి.నారాయణరావు స్థానిక పోలీస్ స్టేషన్లో అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు కురుపాం సిహెచ్‌సి వైద్యాధికారులచే వైద్య పరీక్షల నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసవిలో పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేరంగిని ప్రకృతి సేద్య గ్రామంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కేరంగి గ్రామాన్ని ప్రకృతి సేద్య గ్రామంగా తీర్చిదిద్దాలని, ఇందుకు రైతుల తోడ్పాటు ఎంతో అవసరమని మండల వ్యవసాయశాఖాధికారి కె.తిరుపతిరావు అన్నారు. గ్రామ రైతులు, పెద్దలు శనివారం ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలరోజులుగా గ్రామ పెద్దలు ప్రకృతి వ్యవసాయ సన్నద్ధత సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరడం ఆనందదాయకమని గిరిజన రైతులంతా ప్రకృతి సేద్యం దిశగా నడవాలని కోరారు. అనంతరం గ్రామం నుంచి పదిమంది రైతులు ప్రకృతి సేద్యం చేయడానికి ముందుకొచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నా, నేల ఆరోగ్యం పోషకాలభ్యత పెంపొందించాలన్న ఆరోగ్యవంతమైన పంటలు పండించి ప్రజల ఆరోగ్యం కాపాడాలన్నా, భూతాపాన్ని తగ్గించి జీవ వైవిధ్యాన్ని పెంచుకోవాలన్నా ప్రకృతి సేద్యమే ప్రధాన ఆయుధమని తెలిపారు. రైతులు చిరుధాన్యాల సాగును పెంచాలని, ప్రభుత్వమే మద్దతు ధర కల్పించి చిరుధాన్యాలను కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఘన, ద్రవ జీవామృతాలను వినియోగిస్తే పోడు భూముల్లోనూ అధిక దిగుబడి పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆర్ఒఎఫ్ఆర్ భూములకు నీటి పంపులు అవసరమని, ఈ విషయం అధికారులకు తెలియజేయమని కోరారు. అనంతరం గ్రామంలో చెక్ డాం అవసరమైన ప్రాంతాన్ని, శిథిలమైన చెక్ డాంను పరిశీలించి రైతుల అవసరాలను జిల్లా వ్యవసాయ అధికారి ద్వారా జిల్లా కలెక్టర్‌కు తెలియజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్యం అధికారి సురేష్, విఎఎ అనిల్ కుమార్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక తహశీల్దార్ కార్యాలయ సమీపంలో కొట్టు గుమ్మడకు చెందిన ఉదయాన శివ (27) శనివారం ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శివ తన ట్రాక్టర్ పని నిమిత్తం స్వగ్రామం నుండి వీరఘట్టం వచ్చాడు. పని ముగించుకొని పార్వతీపురం వెళ్లేందుకు హై స్కూల్ వద్ద నడుకూరు నుండి వస్తున్న ట్రాక్టర్ ఎక్కాడు. అయితే ఆ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ట్రాక్టర్ నుంచి జారి పడి టైర్ కింద తలభాగం తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. మృతుడికి తల్లి రాజమ్మ, భార్య రమ్య తో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. శివ మృతితో కొట్టుగుమ్మడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యుత్ స్తంభాలు చోరీ

అధికారుల అండతోనే దొంగతనం?

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఆంధ్రా - ఒడిస్సా వివాదాస్పద గ్రామాలైన కొట్టియా సరిహద్దు గ్రామాల్లో 20 ఏళ్ల కిందట ఐరన్ స్తంభాలతో ఆ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేశారు. వీటి స్థానంలో ఆరు నెలల కిందట తోణాం నుంచి దిగువసెంబి వరకు కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. తీసివేసిన ఆ పాత స్తంభాలు ఐరన్ కావడంతో వీటి ఖరీదు ఎక్కువగా ఉండడంతో విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న పని వాళ్లతో గంజాయిభద్ర జెఎల్ఎంగా పనిచేస్తున్న రామకృష్ణ సూచనతో కరాసువలస పంచాయతీ దత్తివలస గ్రామానికి చెందిన రామస్వామితో ఒక ఆటోని ఏర్పాటు చేసుకుని ఆ స్తంభాలను తోణాం వరకు తెచ్చి అక్కడ విద్యుత్ లైన్‌ను తీసుకొని కట్టర్‌తో ఒక స్తంభాన్ని మూడు ముక్కలుగా చేసిన అనంతరం ఆటోలో లోడింగ్ చేశారు. అనంతరం వీటిని సాలూరులో అమ్మకానికి తీసుకువెళ్లగా గంగన్న దొర వలస వద్ద విద్యుత్ శాఖ సిబ్బంది పట్టుకుని ఎఇకి సమాచారం అందించారు. అనంతరం ఆయన రూరల్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందించారు. ఈ ఫిర్యాదులో ప్రధానంగా రామస్వామి తీశాడని ఎఇ తెలిపారు. ఇందులో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న జూనియర్ లైన్మెన్ రామకృష్ణ పాత్ర ఉందని, వీటిని తీసుకు వెళ్తున్న రామస్వామి స్పష్టంగా వివరించారు. ఇదే విషయంపై ఎఇను అడగ్గా విద్యుత్ శాఖ వారు లేరని ఏదైనా ఉంటే పోలీసులు దర్యాప్తు చేసి ఆ వివరాలను సేకరించి తెలియజేస్తారని తెలిపారు. ఇదే విషయమై రూరల్ ఎస్సై నరసింహమూర్తిని వివరణ కోరగా విద్యుత్ స్తంభాలు చోరీలో రామస్వామితో పాటు జూనియర్ లైన్మెన్ రామకృష్ణ పాత్ర ఉన్నట్టు తమకు సమాచారం ఉందని, వీరిద్దరిపై కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో అవసరం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి పంచాయతీ నాయుడుగూడ, చిన్నబగ్గ పంచాయతీ పరిధిలో గల గూడగుడ్డి గ్రామాల్లో సాగు చేస్తున్న గులిరాగి పంటను స్టేట్ రిసోర్స్ పర్సన్ దేవుళ్లు పరిశీలించారు. ఈ సందర్భంగా గులిరాగి పంటలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం కాలంలో ప్రకృతి వ్యవసాయం అందులో గులి రాగి మానవులకు ఎంతో అవసరమన్నారు. వీటిపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు బిడ్డిక ఆనందరావు, సవర సుదర్శన్‌రావు, ముసలయ్య, డివిజన్ ఇంచార్జ్ బాలు కామేశ్వరరావు, వెలుగు కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ధర్మారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

8న ప్రగతిశీల మహిళా సంఘం విలీన సభ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 8న ఒంగోలులో జరగనున్న ప్రగతిశీల మహిళా సంఘం విలీన సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.రమణి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎస్ఎన్ఎం నగర్ దగ్గర ఉన్న వర్తక కళాసీ సంఘం భవనంలో ప్రగతిశీల మహిళా సంఘం విలీన సభ పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్లుగా విడిపోయి వేర్వేరుగా పనిచేస్తున్న రెండు ప్రగతిశీల మహిళా సంఘాలు ఒకటిగా ఏర్పడాలని భావించి విలీన సభ ఒంగోలులో ఈనెల 8న జరపాలని నిర్ణయించామన్నారు. ఈ సభకు మన్యం జిల్లా నుండి పెద్ద ఎత్తున మహిళలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెంబుడు, జయలక్ష్మి, జన్ని, సబిత, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి పాడి రైతు పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి కె. శైలజ అన్నారు. మండలంలోని పెద్దగొత్తిలిలో శనివారం పశువులకు గాలికుంట వ్యాధి నివారణ టేకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 1 నుండి 30 వరకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, బ్రూసెల్లోసిస్ నిరోధక టీకాలు ప్రతి గ్రామంలో వేస్తామన్నారు. కావున పాడి రైతుల వారి పశువులకు టీకాలు వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ టి. లోకనాథం, వెటర్నరీ వైద్య సిబ్బంది పాడి రైతులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో స్వచ్ఛ సుందర పార్వతీపురం ఆవిష్కరణకు అడుగులు పడుతున్నాయని జిల్లా పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు తెలిపారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమం వాలంటీర్లకు స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో శనివారం శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ కన్సల్టెంట్ శ్రీనివాసన్, జట్టు ఆశ్రమ నిర్వాహకులు పద్మజతో కలిసి డిపిఒ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను సుందరంగా తీర్చిదిద్దడమే స్వచ్ఛ సుందర పార్వతీపురం లక్ష్యం అన్నారు. అన్ని పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఉద్యమ రూపంలో చేపడుతున్నామని చెప్పారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వాలంటీర్లను ఆయన అభినందించారు. ఈ నెల 12 వరకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తడి, పొడి చెత్త వేరు చేసి తీసుకోవాలని అన్నారు. వీటిలో గాజు, ప్లాస్టిక్ సామగ్రి వేరు చేసి చెత్త నుండి సంపద తయారు చేయాలని సూచించారు. ప్రతి గ్రామం ఆదర్శంగా నిలవడానికి వాలంటీర్లు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ కన్సల్టెంట్ శ్రీనివాసన్ మాట్లాడుతూ చెత్త నుండి సంపద తయారు చేయవచ్చన్నారు. ఇంటి నుండి చెత్తను ప్రతి 12 గంటలకు ఒకసారి సేకరించాలని ఆయన చెప్పారు. చెత్త నుండి సంపద తయారు చేసే ప్రక్రియ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పలువురు వాలంటీర్లు పాల్గొన్నారు.